క్లుప్తంగా

ఘనంగా వరసిద్ధి వినాయక ఆలయ వార్షికోత్సవం



పూజల్లో పాల్గొన్న అపార్ట్‌మెంట్ వాసులు

గోపాలపట్నం: గోపాలపట్నం నాయుడు క్వార్టర్స్‌లోని అపార్ట్ మెంట్ ప్రాంగణంలో లక్ష్మీనరసింహ రెసిడెన్షియల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో వరసిద్ధి వినాయక ఆలయ వార్షికోత్సవం శనివారం వైభవంగా నిర్వహించారు. ఉదయం నుంచి అసోసియేషన్ సభ్యులు, కుటుంబ సభ్యులు ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షుడు బాబీ, కార్యదర్శి పి. పద్మావతి, ఉపాధ్యక్షుడు రమేష్, కోశాధికారి డాక్టర్ జగన్నాథరావు, విశ్రాంత ఎస్ఐ కె. వెంకటస్వామి, క్రైమ్ ఏఎస్ఐ గోవిందమ్మ, అపార్ట్ మెంట్ వాసులు పాల్గొన్నారు.

విద్యతోనే మహిళా సాధికారత



ప్రతిభ చూపిన విద్యార్థినులతో అధ్యాపకులు

మల్కాపురం: మహిళలు సంపూర్ణ విద్యావంతులైతే వారి కలలు నెరవేర్చుకోగలరని మల్కాపురం సెయింట్ ఆన్స్ మహిళా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ప్రేమకుమారి అన్నారు. విద్యతోనే ఉన్నతి సాధ్యమవుతుందన్నారు. కళాశాలలో శనివారం నిర్వహించిన డిగ్రీ సీనియర్ విద్యార్థినుల వీడ్కోలు కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. తమ కళాశాలలో చదువుకున్న విద్యార్థినులను సంపూర్ణ విద్యావంతులుగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా కృషి చేస్తున్నామన్నారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థినులను సత్కరించారు.

బస్సుయాత్రకు మేమంతా సిద్ధం

- ప్రజానేతకు ఘన స్వాగతం పలుకుదాం
- 4 గంటలకు గోపాలపట్నంలో యాత్ర ప్రారంభం
- శ్రేణులంతా తరలి రావాలి
- వైఎస్సార్‌సీపీ పశ్చిమ ఎమ్మెల్యే అభ్యర్థి ఆడారి ఆనంద్‌కుమార్



సమావేశంలో పాల్గొన్న నాయకులు కార్యకర్తలు



వైఎస్సార్ సీపీ కార్యాలయంలో ముఖ్యనేతలతో మాట్లాడుతున్న ఆడారి ఆనంద్‌కుమార్

గోపాలపట్నం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి బస్సుయాత్రలో పాల్గొని, జననేతకు సాదర స్వాగతం పలుకుదామని వైఎస్సార్ సీపీ పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి ఆడారి ఆనంద్‌కుమార్ అన్నారు. జగనన్నను మళ్లీ సీఎంగా గెలిపించుకునేందుకు తామంతా సిద్ధంగా ఉన్నామని తెలియజేద్దామన్నారు. మర్రిపాలెం వుడా లే అవుట్‌లోని వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ కార్యాలయంలో ముఖ్య నాయకులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రజా నాయకుడు, పేదల పెన్నిధి వైఎస్ జగన్ మోహన్ రెడ్డిని చూసేందుకు, తమ సమస్యలు తెలిపేందుకు వచ్చేవారికి సహకరించాలని సూచించారు. జగన్ మోహన్ రెడ్డి బస్సు యాత్ర మన ప్రాంతంలో ఉందని ప్రజలకు తెలియజేయాలన్నారు. ఆయన ఆదివారం మధ్యాహ్నం గోపాలపట్నంలో విశ్రాంతి తీసుకున్న అనంతరం సాయంత్రం 4 గంటలకు యాత్ర ప్రారంభిస్తారని తెలిపారు. గోపాలపట్నం నుంచి బాజీ జంక్షన్, బుచ్చిరాజుపాలెం, ఎన్ఏడీ ఫ్లైఓవర్ బ్రిడ్జి మీదుగా మర్రిపాలెం, పాత ఐటీఐ జంక్షన్, ఊర్వశి జంక్షన్, కంచరపాలెం మెట్టు మీదుగా వెళ్తారన్నారు. యాత్రను విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్, జీవీఎంసీ కో-ఆప్షన్ సభ్యుడు బెహరా భాస్కరరావు, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ బీఎస్ కృష్ణ, కలిదిండి బద్రీనాథ్, మాజీ కార్పొరేటర్ అయితంశెట్టి కోటేశ్వరరావు, మాజీ డిప్యూటీ మేయర్ దాడి సత్యనారాయణ, కార్పొరేటర్లు, వార్డు అధ్యక్షులు, వార్డు స్థాయి ముఖ్యనేతలు, గృహ సారథులు, కన్వీనర్లు అనుబంధ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

మీలో ఒకడు.. మీ ఆనంద్

- అవకాశం ఇవ్వండి అభివృద్ధి చేసి చూపిస్తాడు
- 58వ వార్డు ఎన్నికల ప్రచారంలో పిల్లా రమాకుమారి



దోశ వేసి.. మనసు దోచి: ప్రశాంతినగర్‌లో దోశ వేస్తున్న బెహరా భాస్కరరావు



సాకేతపురంలో వృద్ధురాలిని ఓటు అడుగుతున్న ఆడారి సతీమణి మాలతి



స్థానిక నాయకులతో కలిసి ములగాడలో ప్రచారం నిర్వహిస్తున్న రమాకుమారి

మల్కాపురం: ఆడారి ఆనంద్ మీ మనిషి.. ఆయన్ను మీరంతా కలిసి ఎమ్మెల్యేగా గెలిపించుకుంటే మీలో ఒకడిగా మీ మధ్యే ఉంటాడని యలమంచిలి మున్సిపల్ చైర్‌పర్సన్ పిల్లా రమాకుమారి అన్నారు. సార్వత్రిక ఎన్నికల ప్రచార కార్యక్రమంలో భాగంగా 58వ వార్డు ములగాడలో శనివారం ఆమె డోర్ టు డోర్ ప్రచారం చేపట్టారు. జగన్‌మోహన్‌రెడ్డి మళ్లీ సీఎం అయితే ప్రస్తుతం వస్తున్న సంక్షేమ పథకాలు కొనసాగింపుతో పాటు,మరిన్ని మేలైన సేవలు అందుతాయన్నారు. వైఎస్సార్‌సీపీ పశ్చిమ సమన్వయకర్తగా బాధ్యతలు చేపట్టిన మీ ఆనంద్ మీ వార్డులో సుమారు 20 సార్లు పర్యటించి సమస్యలు పరిష్కరించారని వివరించారు. చాలా మంది నిరుపేదలకు తన సొంత ఖర్చులతో వైద్య సేవలతో పాటు,సాంకేతిక కారణాల వల్ల పింఛన్ నిలిచిపోయిన వారికి తన సొంత నిధులతో పింఛన్ అందిస్తూ మానవత్వం చాటుకున్న మంచి మనిషి ఆనంద్ లాంటి వ్యక్తిని ఎమ్మెల్యేగా గెలిపించుకుంటే మరన్ని సేవలు అందుతాయన్నారు. మే 13న జరిగే సార్వత్రిక ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుపై ఓట్లు వేసి విశాఖ ఎంపీగా బొత్స ఝాన్సీని, పశ్చిమ ఎమ్మెల్యేగా ఆడారి ఆనంద్‌కుమార్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని ఆమె అభ్యర్థించారు. కార్యక్రమంలో వార్డు కార్పొరేటర్ గులిగిందల లావణ్య, వార్డు పార్టీ అధ్యక్షుడు దాట్ల శ్రీనివాసరాజు,ధర్మాల వేణు గోపాలరెడ్డి,చుక్క వరలక్ష్మి,జేసీస్ కన్వీనర్ పిల్లా కన్నబాబు,బర్రి సంతోష్, గొందేశి సత్యనారాయణరెడ్డి, పట్నాల నారాయణరావు పాల్గొన్నారు.

కంచరపాలెం: జీవీఎంసీ 57వ వార్డు సాకేతపురంలో వైఎస్సార్‌సీపీ ఎంపీ అభ్యర్థి బొత్స ఝాన్సీ, పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి ఆడారి ఆనంద్‌కుమార్‌కు మద్దతుగా శనివారం సాయంత్రం వార్డు కార్పొరేటర్ ముర్రు వాణి ఆధ్వర్యంలో ఆనంద్‌కుమార్ సతీమణి ఆడారి మాలతి, బుద్ధా సుజాత ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ప్రజలతో కొంత సేపు ముచ్చటించారు. మే 13న జరగనున్న సార్వత్రిక ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుపై ఓటు వేయాలని కోరారు.

91వ వార్డులో..

గోపాలపట్నం: జీవీఎంసీ 91వ వార్డు ప్రశాంతినగర్‌లో వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు, జీవీఎంసీ కోఆప్షన్ సభ్యుడు బెహరా భాస్కరరావు శనివారం ప్రచారం నిర్వహించారు.పశ్చిమ నియోజకవర్గంలో ఆడారి ఆనంద్‌కుమార్ చేసిన అభివృద్ధి, సంక్షేమ పథకాలు ప్రజలకు అందే విధంగా ఎటువంటి చర్యలు తీసుకున్నారో కి తెలియజేశారు. ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి పశ్చిమ ఎమ్మెల్యేగా ఆడారి ఆనంద్ కుమార్‌ను, ఎంపీగా బొత్స ఝాన్సీని గెలిపించాలని కోరారు. రాష్ట్ర ఆర్యవైశ్య కార్పొరేషన్ డైరెక్టర్ గుణిశెట్టి శ్రీనివాసరావు, అప్పలస్వామి నాయుడు పాల్గొన్నారు.

సింధియా: జీవీఎంసీ 62వ వార్డులోని పలు ప్రాంతాల్లో పశ్చిమ వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి ఆడారి ఆనంద్‌కుమార్‌కు మద్దతుగా కార్పొరేటర్ బల్ల లక్ష్మణరావు ప్రచారం నిర్వహించారు.వార్డు వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు భీశెట్టి గణేష్, తదితరులు పాల్గొన్నారు.



62వ వార్డులో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న వార్డు కార్పొరేటర్ లక్ష్మణరావు

తూర్పు తీరంలో 'పూర్వీ లెహర్'



సముద్రంలో కాల్పులు జరుపుతున్న భారత నావికాదళానికి చెందిన నౌక

సింధియా: తూర్పు తీరంలో భారత నావికాదళం పూర్వీ లెహర్‌ను నిర్వహించింది. ఆపరేషన్ కంట్రోల్‌లో భాగంగా తూర్పు నావికాదళ ఫ్లాగ్ ఆఫీసర్ కమాండింగ్ ఇన్ చీఫ్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. సముద్ర భద్రత సవాళ్లను ఎదుర్కొనేందుకు, భారత నావికాదళం సన్నద్ధతను అంచనా వేయడమే లక్ష్యంగా విన్యాసాలు జరిగాయి. ఈ కార్యక్రమంలో భారత నావికాదళానికి చెందిన నౌకలు, జలాంతర్గాములు, విమానాలు, ప్రత్యేక దళాలు పాల్గొన్నాయి.

పశ్చిమలో 2 నామినేషన్ల దాఖలు



ఆర్వో హుస్సేన్‌సాహెబ్‌కు నామ పత్రాలు అందిస్తున్న బీఎస్‌పీ ఎమ్మెల్యే అభ్యర్థి రామచంద్రరావు



సీపీఐ ఎమ్మెల్యే అభ్యర్థి అత్తిలి విమల

కంచరపాలెం: విశాఖ పశ్చిమ నియోజకవర్గంలో శనివారం రెండు నామినేషన్లు దాఖలు చేసినట్లు ఎన్నికల విభాగాధికారులు తెలిపారు. సీపీఐ అభ్యర్థిగా అత్తిలి విమల రెండు సెట్లు, భారత సమాజ్ పార్టీ(బీఎస్‌పీ)కి చెందిన అతుకుంశెట్టి రామచంద్రరావు రెండు సెట్లు నామినేషన్లు దాఖలు చేసినట్లు పశ్చిమ నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి (ఆర్వో) హుస్సేన్ సాహెబ్ తెలిపారు. ఇప్పటివరకు నియోజకవర్గంలో నలుగురు ఎమ్మెల్యే అభ్యర్థులు నామినేషన్లు వేసినట్టు చెప్పారు. నామినేషన్ పత్రాలు స్వీకరించిన అధికారులు వాటిని పరిశీలించి అభ్యర్థుల ఆస్తులు,అప్పులు, నేర చరిత్రలకు సంబంధించిన పూర్తి వివరాలను నోటీసు బోర్డులో చూపించనున్నట్టు చెప్పారు. అభ్యర్థుల వివరాలపై ఎలాంటి సందేహాలు ఉన్నా ఫిర్యాదు చేయవచ్చని ఆర్వో హుస్సేన్ సాహెబ్ తెలిపారు.

వేడుకగా సుబ్రహ్మణ్య స్వామి కల్యాణం



వల్లీ, దేవసేన సమేత సుబ్రహ్మణ్య స్వామి కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

కంచరపాలెం: ఊర్వశి జంక్షన్ రవీంద్రనగర్‌లోని సుబ్రహ్మణ్య స్వామి ఏకాంత ఆలయంలో కార్తికేయ శరవణ ట్రస్టు ఆలయ వ్యవస్థాపక అధ్యక్షుడు దేవాల రాజుకృష్ణ ఆధ్వర్యంలో శనివారం చైత్ర పూర్ణిమ ఉత్సవాలు, స్వామి కల్యాణం ఘనంగా నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు శర్మ కలశ స్థాపన, విఘ్నేశ్వర పూజ, మండపారాధన, అభిషేకాలు, వల్లీ, దేవసేన సమేత సుబ్రహ్మణ్య స్వామి కల్యాణ వేడుక శాస్త్రోక్తంగా జరిపారు. పలు రకాల పూలతో స్వామిని అలంకరించారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ చొక్కాకుల కుమారి, కడగల జ్యోతిష్, కార్యదర్శి కాండ్రేగుల రాము, ఉత్సవ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ఐక్య ఉద్యమాలతోనే ఉక్కు పరిరక్షణ

కూర్మన్నపాలెం: విశాఖ ఉక్కు ప్రజలందరి ఆస్తి అని.. దానిని కాపాడుకునేందుకు ప్రజలను భాగస్వాములను చేయాలని విశాఖ ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీ నాయకులు పేర్కొన్నారు. ఐక్య ఉద్యమాలతోనే స్టీల్‌ప్లాంట్‌ను కాపాడుకోగలమన్నారు. ఉక్కు ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కూర్మన్నపాలెం కూడలిలో ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న దీక్షలు శనివారానికి 1164వ రోజుకు చేరుకున్నాయి. దీక్షలో సంస్థకు చెందిన వివిధ విభాగాల కార్మికులు పాల్గొని నిరసన తెలిపారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ పాలన వల్ల దేశ ప్రజలు దుర్భర పరిస్థితులను అనుభవిస్తున్నారన్నారు. లక్షల కంపెనీలు మూతపడ్డాయని, కార్మికులు పనిలేక రోడ్డున పడ్డారన్నారు. కార్యక్రమంలో పోరాట కమిటీ నాయకులు పాల్గొన్నారు.